సచివాలయాలు.. సేవకు నిలయాలు

- గ్రామాల్లోనే అందుబాటులో అన్ని సేవలు
- గ్రామ స్వరాజ్యానికి ప్రేరణ

అయినవిల్లి: అన్ని ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలు ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో చేరువయింది. విలేజ్ సెక్రటేరియట్లుగా పిలిచే సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ పరిపాలన వికేంద్రీకరణకు నాంది పలికారు. 2019 అక్టోబరు 2 గాంధీ జయంతిన సచివాలయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 19 శాఖలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మన రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. గ్రామాల్లోనే అన్ని సేవలు అందుబాటులోకి రావడంపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనకు జనం నీరాజనాలు పలుకుతున్నారు.


కె.జగన్నాథపురం గ్రామ సచివాలయం

ఇంటికి ముంగిటకే సంక్షేమ పథకాలు

సచివాలయ వ్యవస్థలో భాగంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. దీనికి తోడు 12 శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించారు. ఉద్యోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. పింఛన్, రేషన్‌తో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న 28 రకాల సంక్షేమ పథకాలను ప్రజల చెంతకే తీసుకు వచ్చి ప్రజల వద్దకే పాలన అన్న నానుడిని అమలు చేసి చూపిస్తున్నారు. పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న వారిని గుర్తించి వారికి తక్షణం ప్రభుత్వ సహాయం అందించే విధంగా సరికొత్త పాలనకు అంకురార్పణ చేశారు.

అయినవిల్లి మండల వివరాలిలా..

గ్రామ పంచాయతీలు	21
సచివాలయాలు	19
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	12000
ఇంత వరకు పొందిన సహాయం	రూ.44 కోట్లు
పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు	9,500 మంది
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	రూ.100 కోట్లు

సచివాలయాల్లో అందిస్తున్న సేవలు

ప్రభుత్వ సేవల కోసం గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. నేడు పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు దగ్గరయ్యాయి. నవరత్నాల్లో ప్రధానమైన పింఛన్ పంపిణీ, ఆధార్ అప్‌డేట్, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇళ్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్, రైతు భరోసా, దీర్ఘకాలిక రోగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్ ఇలా ఎన్నో ఎన్నెన్నో సేవలు సచివాలయాల ద్వారా ప్రజలు పొందుతున్నారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

మండల కేంద్రానికి వెళ్లే పని తప్పింది



సచివాలయాల ద్వారా అద్భుతమైన సేవలందిస్తున్నారు. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్తే సరిపోతుంది. గడువులోగా ఆ పని మా గ్రామంలోనే పూర్తి చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధమైన పరిస్థితి లేదు. ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేంది. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలనిస్తున్నాయి.
– వారా లక్ష్మీనరసింహరామ్, తొత్తరమూడి

లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారు



మా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఎంతో మేలు జరిగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి వివరాలు తీసుకుని అర్హత గల పథకాలు అందిస్తున్నారు. వృద్ధుల ఇంటికే వెళ్లి ఒకటో తారీఖునే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నారు. రేషన్ కూడా ఇంటి ముంగిటకే తెచ్చి అందిస్తున్నారు. లబ్ధిదారులంతా ఎంతో సంతోషంగా ఉన్నారు.
– దాసరి వీరాస్వామి, అయినవిల్లిలంక

సచివాలయాలతో ప్రజలకు మేలు



ప్రభుత్వం నుంచి ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. మా గ్రామంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అన్ని శాఖల ఉద్యోగులు ఇక్కడ అందుబాటులో ఉంటున్నారు. మాకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.
– గన్నవరపు సాయిప్రసాద్, అయినవిల్లి

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా సీఎం పాలన

సఖినేటిపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం వీవీమెరక వీవర్స్ కాలనీలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలను వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇంకా ఏమైనా సమస్యలు మిగిలి ఉంటే పరిష్కరించేందుకు గడప గడపకు వస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే కాలంలో పేదల కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి నాగేశ్వరరావు, నాయకులు చింతా సుధాకర్‌రావు, గోళ్ళ సూర్యప్రకాష్ బాపూజీ, నల్లి శివకుమార్, కె.అశోక్, స్థానికులు పాల్గొన్నారు.


వీవీమెరక వీవర్స్ కాలనీలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

పిచ్చికుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

అంబాజీపేట: పదేళ్ల బాలుడిపై గురువారం రాత్రి పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ముక్కామల పశువుల ఆస్పత్రి ఎదురుగా తన ఇంటి వద్ద ఉన్న నాగవరపు జోషిని ఐదు కుక్కలు ఈడ్చుకుంటూ పోయి తీవ్రంగా కరిచాయి. స్థానికులు వాటిని కొట్టి తరిమేశారు. క్షతగాత్రుడు జోషిని హుటాహుటిన అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. వీధి కుక్కలతో పాటు పిచ్చికుక్కలు పెరిగిపోయాయని గత వారం రోజుల కిందట అదే గ్రామానికి చెందిన ఆరుగురు యువకులను, మహిళలను తీవ్రంగా కరిచి గాయపరిచాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కలతో పాటు పిచ్చికుక్కలను తక్షణమే అరికట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నవరత్నాలతో జీవన ప్రమాణాలు మెరుగు

అంబాజీపేట: నవరత్నాల ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సీఎం జగన్‌కి ప్రతి ఒక్కరూ ఆశీర్వచనాలు అందించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ అమలు చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, విత్తనాల శేఖర్, ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముఖ్, పులిదిండి ఏడుకొండలు, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.


జి.అగ్రహారంలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

‘జగనన్న సురక్ష’ను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు అన్నారు. జగనన్న సురక్షపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యేక్ష ప్రసారాన్ని అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వలంటీర్లతో పాటు సచివాలయాల సిబ్బంది ఈ నెల 24 నుంచే ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు 100 శాతం పరిష్కరించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్టు ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చిన రాజా, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

జగనన్న సురక్షపై సమీక్ష

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష పథకంపై సమీక్ష జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి పాల్గొని జగనన్న సురక్ష పథకం అమలు తీరుపై మండలస్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్ ఆదేశించిన విధంగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసే జగనన్న సురక్షను విజయవంతం చేయాలన్నారు. ఈమేరకు గ్రామాల వారీగా రూపొందించిన షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యానికి ప్రాధాన్యం


ఎమ్మెల్యే రాపాకకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

రాజోలు: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం చింతలపల్లిలో ఆరోగ్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో వివిధ సంస్థలు, ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత శిబిరాలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. వైద్యశిబిరంలో ఎమ్మెల్యే రాపాక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ చింతలపల్లి శ్రీకాంత్, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, రాజోలు పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మాజీ సర్పంచ్‌లు తులా సత్యనారాయణ, గెడ్డం సత్యనారాయణ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న పాలవెల్లువ’తో ఆర్థికాభివృద్ధి

రాజోలు: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా గ్రామాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు అన్నారు. శుక్రవారం బి.సావరం సొసైటీ కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన మహిళలను, రైతులకు ‘జగనన్న పాలవెల్లువ’ పథకంపై అవగాహన కల్పించారు. సబ్సిడీ ద్వారా మేలు జాతి గేదెను కొనుగోలు చేసుకునేందుకు సహకార సొసైటీ బ్యాంకులు రుణాలు అందిస్తాయన్నారు. పశుగ్రాసం విత్తనాలు, దాణా మృతం, పశుగ్రాసాన్ని ముక్కలుగా కట్ చేసే యంత్రాలను సబ్సిడీపై అందిస్తారన్నారు. మండల పరిషత్ ఏఓ ఎం.సత్యనారాయణ, ఎస్‌డీఎల్‌సీఓ ఎం.ఏసునాయన, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ టి.ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, సొసైటీ అధ్యక్షుడు నాగాబత్తుల సత్యానందం అన్నారు. ఇసుకపూడిలో జగనన్న పాలవెల్లువలో భాగంగా వైఎస్సార్ క్రాంతి (డ్వాక్రా) ఏపీఎం గంగాధర్ అధ్యక్షతన మహిళా పాల ఉత్పత్తిదారులు, మహిళా డైరీ సహకార సంఘాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారి శ్రీనివాస్, దొమ్మేటి రాధాసూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి తదితరులు పాల్గొన్నారు.


బి.సావరంలో జగనన్న పాలవెల్లువ పథకం ఉపయోగాలు వివరిస్తున్న రాధాకృష్ణారావు

ఆలమూరులో..

ఆలమూరు: పాడిరైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాలవెల్లువ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సర్పంచ్ వనుం చిన్నావతి, పశు వైద్యాధికారి జి.భానుప్రసాద్ కోరారు. మండలంలోని పెనికేరులో కార్యదర్శి కె.వెంకటరెడ్డి అధ్యక్షతన శుక్రవారం మహిళ పాడిరైతులు, డ్వాక్రా సంఘ మహిళలతో సమావేశంలో వారంతా మహిళ సాధికారిత సహకార డెయిరీ సంఘం గ్రామ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షురాలు సర్పంచ్ చిన్నావతి, కార్యదర్శిగా గెద్దాడ లావణ్యతో పాటు మరో తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నికైన వారిలో ఉన్నారు. వనుం జార్జిబాబు, జి.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

‘జల్‌జీవన్ మిషన్’పై కేంద్ర బృందం పరిశీలన

మామిడికుదురు: జల్‌జీవన్ మిషన్ పథకం అమలు తీరుపై కేంద్ర బృందం శుక్రవారం పరిశీలన చేసింది. లూటుకుర్రు, గోగన్నమఠం గ్రామాల్లో బృందం సభ్యులు రాజేష్‌కుమార్ బన్సాల్, గజాన్‌ఫర్ అహ్మద్ పరిశీలించారు. తాగునీటి నాణ్యత, సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు. గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమాధానాలతో సంతృప్తి చెందారు. బృందం సభ్యుడు అహ్మద్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. మనిషికి రోజుకు 55 లీటర్లు తాగునీరు అందిస్తున్నామని, దీన్ని 100 లీటర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా నిర్మించిన సంపుతో పాటు 60 వేల లీటర్ల ట్యాంకును, బృందం సభ్యులు పరిశీలించారు. బృందం సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీహెచ్ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఈ ఏఎస్‌వీ పద్మనాభం, ఏఈ బి.జయశ్రీ పాల్గొన్నారు.

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకం ద్వారా సురక్షితమైన తాగునీటి సరఫరాతో పాటు తాగునీటి సమస్య కూడా పరిష్కారమైందని ఢిల్లీకి చెందిన జాతీయ జల్‌జీవన్ మిషన్ నిపుణులు అన్నారు. మండలంలోని నూరుశాతం ప్రగతి సాధించిన జొన్నాడ, కలవచర్ల గ్రామాలను శుక్రవారం ఢిల్లీ నుంచి విచ్చేసిన ప్రత్యేక బృంద నిపుణుల ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించింది. గ్రామ సర్పంచ్‌లు కట్టా శ్రీనివాస్, వడ్డి వెంకన్న, ఉప సర్పంచ్ నాంద్రె నాగమోహన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తాడి మెహర్ ఆదిత్యరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీఎల్ నరసింహారావు, ఎంపీడీవో కె.జాన్ లింకన్, జలజీవన్ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొడగట్లపల్లిలో వరుణ జపం

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లిలో స్థానిక జానకీయమ్మ సత్రం సమీపాన ఉన్న మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వరుణ జపం నిర్వహించారు. ఉదయం సమయంలో మండలంలోని టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో ఈ వరుణ జపాన్ని నిర్వహించారు. ఈ సమయంలో ఆకాశంలో మబ్బులు ఏర్పడి వర్షపు జల్లులు పడటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

మోదీ పాలనపై ఇంటింటి ప్రచారం

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో సంక్షేమ పాలన అందించారని బీజేపీ పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గృహ సంపర్క్ యోజనలో భాగంగా పెద పట్నంలంకలో బీజేపీ నేతలు మోదీ పాలనపై కరపత్రాలు పంచారు. బి.దొడ్డవరంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా అతని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగికదాడి

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రుకు చెందిన ఓ మైనర్ బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 12 ఏళ్ల బాలిక ఎనిమిదో తరగతి చదువుతుంది. బాలిక తండ్రి కూలి పని నిమిత్తం గురువారం పనికి వెళ్లాడు. ఇదే అదనుగా చూసి అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రసాద్ ఆమెపై లైంగిక దాడి చేశాడు. శుక్రవారం రాత్రి బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల పనితీరుపై సమీక్ష

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య సమీక్షించారు. డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు తదితరులు పనితీరును అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష పథకంలో 11 సర్వీసులు పూర్తిగా ఫ్రీగా అందజేస్తున్నామన్నారు.

చల్లబడిన వాతావరణం

మలికిపురం/పి.గన్నవరం: గత నెల రోజులుగా తీవ్రమైన ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడారు. ఉక్కపోతతో ప్రాణాలు అరచేత పట్టుకుబతికారు. వర్షాలు కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ప్రజలు చల్లబడడంతో పాటు కొబ్బరి, సరుగుడు, వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేశాయి. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురిసింది. ఈ వర్షంతో రైతన్నలు కూడా వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు.

ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

మామిడికుదురు: నవయువ క్రీడా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిర్వహించిన ఒలింపిక్ రన్‌లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.విజయకుమారి ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు ఒలింపిక్ రన్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో క్రీడా సంఘం కార్యదర్శి బొంతు మధుకుమార్, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పీడీ ఎం.శ్రీలక్ష్మి, రాష్ట్ర, జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘ కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ఆదేశాల మేరకు ఒలింపిక్ డే రన్ నిర్వహించామని కన్వీనర్, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.పద్మనాభం ఆధ్వర్యంలో ఒలింపిక్ జ్యోతిని వెలిగించి కళాశాల విద్యార్థులు ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు. ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ యూత్ కార్యదర్శి బందారు కాశీ, పీడీ బొంతు మధుకుమార్, అధ్యాపకులు భాస్కరరావు, ఎస్.రాజు, ప్రతాపరాజు, నాయుడు, బోస్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నగరంలో నిర్వహించిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


కొత్తపేటలో ముఖర్జీకి నివాళులర్పిస్తున్న సత్యానందం తదితరులు

కొత్తపేట: భారతీయ జనసంఘ్ పార్టీని స్థాపించిన శ్యామాప్రసాద్ ముఖర్జీ హిందూ జాతీయ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించారని రాష్ట్ర బీజేపీ స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ పాలూరి సత్యానందం అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం జనసంఘ్ వ్యవస్థాపకుడు ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నేత పాలూరి సత్యానందం, నియోజకవర్గ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గృహ సంపర్కయోజనలో భాగంగా వానపల్లి, అవిడి, మోడేకుర్రు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలన, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర టీచర్స్ సెల్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదరం, జిల్లా కార్యవర్గ సభ్యుడు అరిగెల రమేష్, అంబర్కాన సుధాకర్, ఓబీసీ మోర్చా కార్యదర్శి కుడుపూడి దావీదు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లో-వోల్టేజీ పరిష్కారానికే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

సఖినేటిపల్లి: గ్రామాల్లో లో వోల్టేజీ సమస్యల పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం అంతర్వేదిపాలెం మెయిన్, వీరా వారి మెరక ఏరియాల్లో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు నల్లి సురేంద్రరావు, ఈదరవిరెడ్డి, కోనపల్లి వెంకటేశ్వరరావు, మందపాటి సత్యనారాయణ, కె.అశోక్, నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్‌రాజు


ఎమ్మెల్యే చిట్టిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గౌతమ్‌రాజు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడిగా పాశర్లపూడికి చెందిన తోరం గౌతమ్‌రాజును నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి. గౌతమ్‌రాజు శుక్రవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని గౌతమ్‌రాజు చెప్పారు.

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసరావు



కొత్తపేట: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా కొత్తపేటకు చెందిన హైకోర్టు న్యాయవాది పుప్పాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆ మేరకు జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు శ్రీనివాసరావు శుక్రవారం కొత్తపేటలో విలేకరులకు తెలిపారు. దీని పదవీ కాలం మూడేళ్లు ఉంటుందన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం కక్షిదారులు సంప్రదించాలని కోరారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ఫ్యామిలీ డాక్టర్ పథకం పేద, మధ్యతరగతి ప్రజల పాలిట వరంగా మారిందని వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలోని ఇసుకపూడి తురకలదొడ్డిలో ఫ్యామిలీ డాక్టర్‌ను శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక నాయకులతో శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే గుడ్లు పాడైపోయి ఉండటాన్ని చూసి ఆరా తీశారు. గుడ్లు పంపిణీ చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన గుడ్లు ఇవ్వడం లేదని నిల్వ ఉండటంతో పాడైపోతున్నాయని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వివరించారు. పాడైన గుడ్డు స్థానే వేరే గుడ్డును విద్యార్థులకు పెడుతున్నామన్నారు. విద్యార్థులకు రుచి, శుచిరమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, వాసంశెట్టి పెదబాబు, రాయుడు కృష్ణమహేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు కోరారు. కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు ఫ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌పై వైద్యారోగ్య సిబ్బంది వివిధ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఏమైనా అనారోగ్య పరిస్థితులు సంభవిస్తే ప్రభుత్వం తగిన సాయం అందిస్తుందన్నారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.